క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్

డాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని గురువారం ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కొంతసేపు ఆయనతో ముచ్చటించారు.

ద్రోణంరాజు శ్రీవత్సవ్‌కు అభినందనలు



ద్రోణంరాజు శ్రీవత్సవ్‌ను అభినందిస్తున్న లండా రమణ, లింగం శ్రీనివాసరావు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా నియమితులైన ద్రోణంరాజు శ్రీవత్సవ్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం ఆయనను పార్టీ 34వ వార్డు నాయకులు లింగం శ్రీనివాసరావు, లండా రమణ, మాజీ కార్పొరేటర్ జగ్గపల్లి అప్పలరాజు, మళ్ల బుజ్జి మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. పార్టీలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో ఆరుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ అమ్మినాయుడు

ఎంవీపీ కాలనీ: ఆర్టీసీ డ్రైవర్లు విధిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ట్రాఫిక్ సీఐ ఎస్.అమ్మినాయుడు కోరారు. వాల్తేర్ డిపోలో గురువారం నిర్వహించిన రోడ్డు భద్రత మాసోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్సులను బస్టాప్‌ల వద్ద క్రమ పద్ధతిలో నిలపాలన్నారు. బస్సుల్లో ఫుట్‌పాత్‌లపై యువకులు నిలుచోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎ. గణేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఇంజినీరింగ్, ఇన్‌ఫోర్స్‌మెంట్, భద్రత చర్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సుధాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



రంగిరీజువీధి హెల్త్ సెంటర్‌లో మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది



జబ్బరతోటలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం

- అదే 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఉద్దేశం
- 36, 37 వార్డుల్లో వైద్య శిబిరాలకు విశేష స్పందన
- 1,000 మందికి ఉచిత వైద్య సేవలు



జబ్బరతోట ఆరోగ్య కేంద్రంలో చంటి పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్: ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్న ప్రధాన ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజు వీధిలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 37వ వార్డు జబ్బరతోటలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. సుమారు వెయ్యి మందికి వైద్య పరీక్షలు చేశారు. పలువురికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రత్యేక వైద్యం కోసం 28 మందిని వివిధ ఆస్పత్రులకు రిఫర్ చేశారు.

వైద్య సేవలపై ఆరా..

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయో ఆరా తీశారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలన్నదే ఈ కార్యక్రమ ఉద్దేశమని వైద్యులు తెలిపారు.

ఉదయం 9 గంటల నుంచే..

రంగిరీజు వీధి, జబ్బరతోట ఆరోగ్య కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచే వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అప్పటికే పెద్ద ఎత్తున వైద్య శిబిరాల వద్ద జనం క్యూ కట్టారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటూ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మహాలక్ష్మి, డాక్టర్ హలీమా పర్వీన్, స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొన్నారు.



రంగిరీజువీధి హెల్త్ సెంటర్‌లో మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

24 నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలు



అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

జగదాంబ: ఈ నెల 24 నుంచి నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. 35వ వార్డులోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో గురువారం ఆయన జోనల్ కమిషనర్ శివ ప్రసాద్, క్రీడా సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు జరిగాయన్నారు. అందులో గెలుపొందిన జట్లతో నియోజకవర్గ స్థాయిలో క్రికెట్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. క్రీడాకారులకు కావాల్సిన వసతులు, అల్పాహారం, భోజన సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రౌండ్ సిద్ధం చేయాలన్నారు. క్రీడల ప్రారంభానికి రూ.25 వేలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయిలో ఆడాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఏఈ సంషుద్దీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న కారు దగ్ధం



కారు నుంచి ఎగసిపడుతున్న మంటలు, దట్టమైన పొగ

ఆరిలోవ: హెల్త్ సిటీ పక్కన బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో ఆగి ఉన్న ఓ కారు గురువారం దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. ఈ రోడ్డులో ఓ కారు(టాటా వింగర్) మరమ్మతులకు గురికావడంతో ఏడాది నుంచి నిలిపి వదిలేశారు. ఇది ఎవరిదో తెలియదు. స్థానిక చిన్నారులు కొందరు గురువారం మధ్యాహ్నం ఈ కారు తలుపు తెరిచి లోపలికి వెళ్లి ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కారులో ఉన్న పిల్లలు భయంతో బయటకు వచ్చి పరుగులు తీశారు. పెద్ద మంటలు, దట్టమైన పొగ రావడంతో ఏం జరుగుతుందో తెలియక స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కొందరు యువకులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఈలోగా యువకులు నీళ్ల చల్లి మంటలు అదుపుచేయడానికి ప్రయత్నించారు. ఇంతలో అగ్నిమాపక వాహనంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని కారులో ఎగసిపడుతున్న మంటలను పూర్తిగా అదుపు చేశారు. అప్పటికే కారు అంతా దగ్ధమైంది. ఇదిలా ఉండగా పాడైన కారు నుంచి మంటలు ఎలా వచ్చాయో అనే దానిపై అగ్నిమాపక సిబ్బందికి కూడా స్పష్టత రాలేదు. పిల్లలు అగ్గిపెట్టెలు పట్టుకుని ఆడుకుంటూ పుల్లలు వెలిగించడం వల్లే కారులో సీట్లు కాలిపోయి మంటలు వ్యాపించినట్టు భావిస్తున్నట్టు కొందరు స్థానికులు తెలిపారు.

రోడ్డుకు ఇరువైపులా ప్రైవేట్ బస్సులు



వైఎస్సార్ పార్కు రోడ్డులో నిలిపివేసిన ప్రైవేట్ బస్సులు

సీతమ్మధార: వైఎస్సార్ సెంట్రల్ పార్కు రోడ్డులో ఇరువైపులా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నిలిపివేయడంతో వాహనాల రాకపోకలకు, పాదచారులకు ఇబ్బందికరంగా మారింది. శ్రీకాకుళం, విజయనగరం తోపాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన ప్రైవేట్ బస్సులను ఈ రోడ్డులో పార్క్‌చేస్తున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు బస్సులు నిలిచి ఉంటున్నాయి. జీవీఎంసీ నుంచి ద్వారకానగర్ వెళ్లే మార్గంలో నిలిపివేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఆర్టీసీ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత



మాట్లాడుతున్న శిరిషా దేవి

గోపాలపట్నం: రహదారి భద్రత అందరి బాధ్యతగా భావించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిరీషాదేవి అన్నారు. ఈ మేరకు గోపాలపట్నం సమీప సింహాచలం డిపోలో గురువారం నిర్వహించిన రహదారి భద్రత మాసోత్సవాల్లో ఆమె మాట్లాడారు. బస్సు డ్రైవర్లు ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని వాహనాలను నడపాలన్నారు. ప్రధానంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం చాలా ప్రమాదకరమన్నారు. డ్రైవర్లు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కె.రాజశేఖర్, అసిస్టెంట్ డిపో మేనేజర్ ఎల్.సారి తులసి, డిపో సూపరింటెండెంట్ కె.వి.జి.కొండలరావు, డిపో సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



కార్తీక్ మృతదేహం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు ప్రాంతంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీవీఎంసీ 4వ వార్డు నేరెళ్లవలసకు చెందిన ఊళ్ల కార్తీక్ (25) తన తల్లిదండ్రులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. తల్లిదండ్రులు కూలి పని చేస్తుండగా, కార్తీక్ కార్ డ్రైవర్‌గా, రాడ్ వైండింగ్ పనులు చేస్తుండేవాడు. కొన్ని నెలల నుంచి పనులు లేక ఖాళీగా ఉంటున్నాడు. ఏదో పని చూసుకోమని తండ్రి చెబుతుండేవాడు. రోజూ మాదిరిగానే తల్లిదండ్రులు గురువారం కూలి పనులకు వెళ్లగా కార్తీక్ మనసు బాగా లేదని ఇంట్లోనే ఉండిపోయాడు. గురువారం మధ్యాహ్నం తన తండ్రి వెంకటరావుకు ఫోన్ చేసి తాను చనిపోతానని కార్తీక్ చెప్పాడు. ఎంటువంటి నిర్ణయం తీసుకోవద్దని సాయంత్ర వచ్చి మాట్లాడతానని తండ్రి వారించాడు. సాయంత్రం తల్లిదండ్రులు పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్నప్పటికే కార్తీక్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన వారు తలుపులు బద్దలుకొట్టి కార్తీక్‌ను స్థానికుల సాయంతో భీమిలి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సింహగిరిపై 'స్వచ్ఛ తీర్థ'



సింహగిరిపై శుభ్రం చేయిస్తున్న ఉద్యోగి

సింహాచలం: సింహగిరిపై గురువారం స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామచంద్రుడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా దేవాలయాల్లో ఈ నెల 14 నుంచి 21 వరకు స్వచ్ఛ తీర్థ కార్యక్రమం నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో సింహగిరిపై ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ దక్షిణ రాజగోపురం వద్ద ఉన్న చెత్తను తొలగించారు. దేవస్థానం ఉద్యోగి లంక సూరిబాబు, శానిటేషన్ సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'ఉక్కు ఉద్యోగుల తొలగింపు సరికాదు'

ఉక్కునగరం: ఉద్యోగులను తొలగించాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు తగవని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు అన్నారు. వాటిని ఐఎన్‌టీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. గురువారం యూనియన్ నాయకులు సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోఫ్టీను కలిసి సమస్యలపై చర్చించారు. సుమారు 1500 మంది తొలగిస్తారని వస్తున్న వార్తలు ఉద్యోగులకు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఇప్పటికే సిబ్బంది కొరతతో అన్ని విభాగాలు సతమతమవుతుంటే ఉన్న ఉద్యోగులను తొలగించడమేమిటని ప్రశ్నించారు. సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, బి.ఎస్.రాజు, కొమ్ము ప్రసాదరావు, కె.అవతారం, వి.ఎం.నాయుడు, సుబ్బయ్య, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మ బాబా స్మృతి దినోత్సవం

పెదగంట్యాడ: ప్రపంచ శాంతి కోసం పాటుపడుతూ ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన కల్పిస్తున్న బ్రహ్మకుమారీల సేవలు అభినందనీయమని యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి అన్నారు. 65వ వార్డు భానోజీ తోటలో బ్రహ్మ బాబా స్మృతి దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ధ్యానాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్మృతి దినోత్సవ చిత్ర పటాలను ఆవిష్కరించారు. బ్రహ్మకుమారి మణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, అండిబోయిన అప్పారావు, పులి వెంకటరమణారెడ్డి, అండిబోయిన శ్రీను, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

దర్శకుడు గోపాలకృష్ణకు సత్కారం



గోపాలకృష్ణను సత్కరిస్తున్న సీఐ రమేష్, సంస్థ ప్రతినిధులు

భీమునిపట్నం: భీమిలిలోని కళాసాహితి సంస్థ ఆధ్వర్యంలో గురువారం సినీ దర్శకుడు ఎస్.గోపాలకృష్ణను సత్కరించారు. కళాసాహితి అధ్యక్షుడు పి.రాజేంద్ర ప్రసాద్‌వర్మ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఐ డి.రమేష్ మాట్లాడుతూ కళాసాహితి ఆధ్వర్యంలో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. సినీ నటి జయసుధను వెండితెరకు పరిచయం చేసిన దర్శకుడు గోపాలకృష్ణను సత్కరించి గౌరవించడం అభినందనీయమన్నారు. దర్శకుడు గోపాలకృష్ణ మాట్లాడుతూ తాను పరిచయం చేసిన జయసుధ పెద్ద నటిగా ఎదిగి గొప్ప పేరు తెచ్చుకోవడం తనకు ఎంతో ఆనందంగాను, గర్వంగాను ఉందన్నారు. ఈ సందర్భంగా బాలికల సంప్రదాయ నృత్య ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అడిదం సన్యాసిరాజు, ముసునూరి సూర్య శ్రీనివాస్, కాళ్ల సన్నీ, అడిదం కిశోర్ పాల్గొన్నారు.

సిరులతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి దంపతులు



వాసుపల్లి దంపతులకు ప్రసాదం అందజేస్తున్న ఈవో శిరీష

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా గురువారం వారు బురుజుపేట కనకమహాలక్ష్మిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి వారిద్దరిచే అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం సిరులతల్లి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గ ప్రజల పుణ్యఫలం వల్లే అమ్మవారు ఇక్కడ స్వయంభుగా వెలిశారన్నారు. దక్షిణ ఎమ్మెల్యేగా అమ్మ కరుణ కటాక్షంతో రెండు సార్లు ప్రజాసేవ చేసుకునే భాగ్యం కలిగిందని చెప్పారు. ఎమ్మెల్యేగానే గాక ప్రతి ఒక్క కుటుంబ సభ్యుడిగా పనిచేస్తున్నానన్నారు. ప్రజల ఆశీస్సులతో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా అందజేస్తానని తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాసుపల్లికి గణేషుడి చిత్రపటం బహూకరణ



ఎమ్మెల్యే వాసుపల్లికి వినాయక చిత్రపటం అందజేస్తున్న సూరాడ అప్పారావు

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పెళ్లిరోజు సందర్భంగా గురువారం వాసుపల్లి దంపతులకు పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు గణేషుడి చిత్రపటం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల మనిషి గణేష్ కుమార్‌కు కనకమహాలక్ష్మి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన అభిలషించారు. కార్యక్రమంలో భానోజీరావు, సంస్థ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను రక్షించుకుందాం



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: ప్రజలకు అన్ని విధాలా సేవలందించి ఆదుకుంటున్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం కాకుండా రక్షించుకోవాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే పుట్టగతులుండవని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపడుతున్న నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,022వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మణమూర్తి, జిల్లా కమిటీ సభ్యుడు పి.వెంకటరావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలు లక్షలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అండగా నిలుస్తున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పలు పత్రికల్లో వస్తోందని, ఈ ప్రయత్నాలు మానుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను విదేశీ, స్వదేశీ పెట్టుబడుదారులకు అమ్మేయాలని చూడటం అవివేకమన్నారు. ప్రైవేటీకరణ విధానాలను మోదీ సర్కారు మానుకోవాలని హితవు పలికారు. దీక్షా శిబిరంలో వై.రాజు, జి.వి.రమణ, వి.తులసీరాం, జేఆర్ నాయుడు, కె.కుమారి, ఆర్.శ్రీను, వి.కృష్ణారావు, ఆర్.వి.ఎస్.వి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

1,071వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



1,071వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని హితవు పలికారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1071వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులతో పాటు ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు కూర్చుని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు తిరగబడే రోజు వస్తుందన్నారు. కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాల పరిస్థితి నేటికీ దీనస్థితిలో ఉందని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటేనే మంచిదని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సింహాచలేశునికి స్వర్ణ పుష్పార్చన



స్వర్ణపుష్పాలు

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన కనులపండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి, కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. నీరాజనం సమర్పించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేత్రపర్వం.. నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణాన్ని (శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి కమనీయంగా కల్యాణం జరిపించారు. అర్చకులు టి.పి. రాజీవ్‌లోచన్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.



నిత్యకల్యాణంలో మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు